క్లుప్తంగా

ప్రత్యేక పూజలో ఎమ్మెల్యే



సాయిబాబా ఆలయంలో ఎమ్మెల్యే తదితరులు

నవాబుపేట: మండల పరిధిలోని ఎల్లకొండ గ్రామంలోని శ్రీ సాయిబాబా తృతీయ వార్షికోత్సవం సందర్భంగా చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో నిర్వహించిన అయ్యప్పస్వామి పడి పూజలో పాల్గొని స్వాములతో కలిసి భోజనం చేశారు. మండల కేంద్రంలోని శీరమాణిక్ ప్రభు ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన పల్లకీ సేవ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గీతాసింగ్‌నాయక్, వైస్ చైర్మన్ బల్వంత్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి, నాయకులు చిట్టెపు మల్లారెడ్డి, నాగిరెడ్డి, ప్రశాంత్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, ప్రకాశం, నర్సింహారెడ్డి, కల్యాణ్‌రావు, రఘుపంతులు తదితరులు పాల్గొన్నారు.

అనాథ శవానికి 'అమ్మానాన్న' అంత్యక్రియలు



మృతదేహాన్ని అంత్యక్రియలకు తీసుకెళ్తున్న ఫౌండేషన్ సభ్యులు

కొడంగల్ రూరల్: ఇటీవల అనారోగ్యానికి గురై ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందిన వాజిద్‌ఖాన్‌కు అమ్మానాన్న ఫౌండేషన్ సభ్యులతోపాటు పలువురు ముస్లిం నాయకులు అంత్యక్రియలు నిర్వహించారు. రెండేళ్ల క్రితం ఈ ప్రాంతానికి వచ్చి భిక్షాటన చేస్తూ జీవనం సాగించేవాడని తెలిపారు. పోలీసులకు సమాచారం అందించి ముస్లిం నాయకుల సహకారంతో వాజిద్‌ఖాన్‌కు అంత్యక్రియలు నిర్వహించినట్లు ఫౌండేషన్ ఫౌండర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



వీరబ్రహ్మేంద్ర స్వామి వారి పూజలో హరిప్రియ తదితరులు

పరిగి: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు హరిప్రియ అన్నారు. ఆదివారం ఆమె మండల పరిధిలోని మాదారం గ్రామంలో నిర్వహించిన వీరబ్రహ్మేంద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం హరిప్రియ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు భక్తి భావాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్‌రెడ్డి, రాములు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



తాండూరు: తాండూరు మున్సిపల్ పరిధిలోని 30వ వార్డులు ఆదివారం సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. మున్సిపల్ కౌన్సిలర్ మెహరాజ్‌బేగం, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నయుమ్ పనులను పర్యవేక్షించారు. 30వ వార్డుకు మున్సిపల్ నిధులను రూ.10 లక్షలు మంజూరు చేయడంతో సీసీ రోడ్డు పనులు చేపట్టారు. వచ్చే నెల మున్సిపల్ పాలకవర్గం గడువు ముగుస్తుండడంతో పనులను త్వరితగతిని పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత ముఖ్యం

బషీరాబాద్ ఎస్ఐ శంకర్

బషీరాబాద్: సైబర్ నేరాల పట్ల ప్రజలు కనీస అవగాహన కలిగి ఉండాలని బషీరాబాద్ ఎస్ఐ శంకర్ సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్ల పట్ల గ్రామాలు, కూరగాయాల సంతల దగ్గర ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు తమ వ్యక్తిగత బ్యాంకుల వివరాలను అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. ఫోన్‌లలో ఓటీపీ, ఓఎల్ఎక్స్, పేటీఎం, గూగుల్ పే, ఫోన్ పే, కేవైసీలను అప్‌డేట్ చేయమని వచ్చే మెసేజ్‌లకు స్పందించవద్దన్నారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు డయల్ చేయాలని సూచిస్తున్నారు. సైబర్ క్రైం బాధితులు వెంటనే ఫిర్యాదు చేస్తే డబ్బులు రికవరీ చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇటీవల కాలంలో మహిళలు, పిల్లలను టార్గెట్ చేసుకుని సైబర్ నేరాలు పెరుగుతున్నయన్నారు. ఇంటర్నెట్‌ను పరిమితికిమించి వాడిన ప్రమాదమేనని వెల్లడించారు.

ఇరవై ఏళ్లుగా అవస్థలు

- చిన్న బస్టాండ్‌తో ప్రయాణికుల పాట్లు
- కోట్‌పల్లిలో నూతన బస్ షెల్టర్ నిర్మించాలని వినతి



కోట్‌పల్లి మండల కేంద్రంలో బస్‌షెల్టర్

బంట్వారం: బస్టాండ్ నిర్మించకపోవడంతో కొత్తగా ఏర్పడిన కోట్‌పల్లి మండల కేంద్రంలో ప్రయాణికులకు పాట్లు తప్పడం లేదు. ఇరవై ఏళ్ల కిందట నిర్మించిన చిన్న పాటి బస్ షెల్టరే దిక్కైంది. ఇప్పటికీ పాలకులు మాత్రం నూతన బస్టాప్ మంజూరు దిశగా చర్యలు చేపట్టడం లేదు. ప్రస్తుతం ఉపయోగిస్తున్న బస్ షెల్టర్ ప్రయాణికులకు సరిపోవడం లేదు. దీంతో చాలా మంది హోటళ్లు, దుకాణాల వద్ద బస్సుల కోసం నిరీక్షించాల్సి వస్తుంది. నిత్యం తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

సంత రోజు రద్దీ

కోట్‌పల్లి మండల కేంద్రంలో ప్రతి సోమవారం సంత జరుగుతుంది. దీంతో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు నిత్యావసర సరుకులు, కూరగాయాల నిమిత్తం కోట్‌పల్లికి వస్తుంటారు. బస్ షెల్టర్ పక్కనే సంత జరగడంతో రద్దీ మరీ ఎక్కువగా కనిపిస్తుంటుంది. ప్రైవేటు వాహనాలు బస్ షెల్టర్‌కు ఎదురుగానే నిలిపి ఉంచుతున్నారు. చిరు వ్యాపారులు కూడా తోపుడు బండ్లను అక్కడే పెడుతున్నారు. బస్సులు వస్తే షెల్టర్‌లో కూర్చున్న ప్రయాణికులు త్వరగా వెళ్లలేకపోతున్నారు.

మండలం ఏర్పడినా..

కోట్‌పల్లి మండలం కొత్తగా ఏర్పడిన ఇప్పటి వరకు బస్టాండ్ నిర్మాణం ఊసే లేదు. ఆర్టీసీ అధికారులు కనీసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిన దాఖలాలు కూడా కనిపించడం లేదు. వివిధ పనుల నిమిత్తం ప్రతి రోజు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే వారి సంఖ్య ఎక్కువైంది. చాలా మంది బస్సుల్లో వస్తుంటారు. తాండూరు, వికారాబాద్, సంగారెడ్డి డిపోలకు చెందిన ఆర్టీసీ బస్సులు కోట్‌పల్లికి వచ్చిపోతుంటాయి. ప్రతి రోజు వందలాది మంది వివిధ ప్రాంతాలకు ఇక్కడి నుంచే ప్రయాణిస్తుంటారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బస్టాండ్ నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అయ్యప్ప స్వామి ఆలయానికి విరాళం



దాతలకు రసీదు ఇస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కొడంగల్: పట్టణ శివారులో నిర్మిస్తున్న శ్రీధర్మ శాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి కొడంగల్‌కు చెందిన బాకారం విజయ్ శేఖర్ కుటుంబ సభ్యులు ఆదివారం రూ.1,00,116 విరాళం ఇచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు డాక్టర్ రవీంద్ర యాదవ్, పీ.శ్రీనివాస్‌గౌడ్, ఉమాపతి గౌడ్, కానుకుర్తి నర్సిరెడ్డి, పప్పు డాగకు నగదు అందజేశారు. కొడంగల్ శివారులో బండల ఎల్లమ్మ ఆలయ సమీపంలో బీజాపూర్ - హైదరాబాద్ జాతీయ రహదారి పక్కన అయ్యప్ప స్వామి ఆలయాన్ని నిర్మిస్తున్నారు. వందలాది మంది దాతల సహకారంతో ఆలయ నిర్మాణం జోరుగా సాగుతోంది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యుడు డాక్టర్ రవీంద్ర యాదవ్, కానుకుర్తి నర్సిరెడ్డిలు మాట్లాడుతూ.. అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి దాతలు సహకరించాలని కోరారు. విరాళాలు ఇస్తామని హామీ ఇచ్చిన భక్తులు స్వచ్ఛందంగా ముందుకు ఇచ్చి సహకరించాలన్నారు.

కంకర వేశారు.. వదిలేశారు



వీరారెడ్డిపల్లి రోడ్డు దుస్థితి

తాండూరు రూరల్: కంకర వేసిన రోడ్డుపై నడవాలంటే గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. గత ఆరు నెలల నుంచి ఇదే అవస్థలు ఎదుర్కొంటున్నామని మండలంలోని వీరారెడ్డిపల్లివాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీరారెడ్డిపల్లి గేటు నుంచి వీరభద్రేశ్వరస్వామి దేవాలయం వరకు రూ.1 కోటి 20 లక్షలతో బీటీ రోడ్డును ప్రభుత్వం మంజూరు చేసింది. పనులు దక్కించుకున్న సదరు కాంట్రాక్టర్ కంకరవేసి పనులను మధ్యలో వదిలేశాడు. దీంతో ఆ కంకరపైనే వాహనాల రాకపోకలు సాగిస్తున్నారు. కంకర ఉండటంతో బస్సుతో పాటు అంబులెన్స్ కూడా రావడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకొని రోడ్డును పూర్తి చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వైభవోపేతంగా దీపోత్సవం



ఉప ఆలయాల వద్ద దీపారాధన



దీపారాధన చేస్తున్న అర్చకులు

కొడంగల్ రూరల్: పట్టణంలోని పేదల తిరుపతిగా పేరుగాంచిన శ్రీమహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో ఆదివారం రాత్రి అత్యంత వైభవోపేతంగా కార్తీక దీపోత్సవం నిర్వహించారు. దీపావళి తర్వాత వచ్చే పౌర్ణమిని పురస్కరించుకొని దేవాలయ ఆస్థాన మండపంలో దీపాలకు సంప్రోక్షణ, పుణ్యావాచనం కార్యక్రమాలు చేశారు. దేవాలయంలో ఉన్న అన్ని ఉప ఆలయాలలో దీపారాధన చేశారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం మేళ తాళాలతో వరాహస్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం ఆవరణలో గడ్డితో చేసిన గుడిసెకు నిప్పంటించారు. తిరుమల తిరుపతి దేవస్థానం మాదిరిగానే ఇక్కడి దేవాలయంలో కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు, పురోహితులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో కేశవస్వామివారి జయంతి



విశేష అలంకరణలో స్వామివారు

కొడంగల్: పట్టణంలోని బ్రాహ్మణవీధిలో వెలసిన శ్రీకేశవస్వామివారి జయంతి ఉత్సవాలను ఆదివారం ఆలయ అర్చకులు అక్కి శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 5గంటలకు సుప్రభాతం, నుంచే స్వామివారికి విశేష పూజలు చేశారు. అనంతరం దూప దీప నైవేద్యాలను సమర్పించారు. మంగళహారతులు అందిస్తూ భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

మున్సిపల్ అభివృద్ధికి ఎమ్మెల్యే కృషి

తాండూరు: ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి సహకారంతో తాండూరు మున్సిపాలిటీ శరవేగంగా అభివృద్ధి పథంలో ముందుకు వెళుతోందని తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం తాండూరు మున్సిపల్ పరిధిలోని 13వ వార్డులో రూ.10 లక్షల డీఎంఎఫ్‌టీ నిధులతో మురుగు కాల్వ నిర్మాణానికి చైర్మన్ బాల్‌రెడ్డి పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సారథ్యంలో అభివృద్ధికి అడుగులు పడుతున్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు తదితరులున్నారు.

రాంపూర్‌లో ముగిసిన ఉత్సవాలు

బంట్వారం: కోట్‌పల్లి మండలంలోని రాంపూర్ దత్తాత్రేయ ఆలయంలో కొనసాగుతున్న ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. దత్తాత్రేయ జయంతి సందర్భంగా 13వ తేదీ నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూడు రోజుల పాటు వివిధ కార్యక్రమాలు చేపట్టి అన్నదానం చేశారు. చివరి రోజు భక్తిశ్రద్ధలతో స్వామి వారికి పల్లకీ సేవ నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఏర్పాటు

యాలాల: ఎమ్మార్పీఎస్ మండల నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. ఈ ఎన్నికను జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ మాదిగ, మండల ఇన్‌చార్జి దప్పు మహేందర్ సమక్షంలో నిర్వహించారు. మండల కమిటీ అధ్యక్షుడు మెట్లి సూర్యప్రకాష్, ప్రధాన కార్యదర్శిగా పకీరప్ప, ఉపాధ్యాక్షులుగా సాయిలు, లాలప్ప, అధికార ప్రతినిధిగా శ్రావణ్, కార్యదర్శిగా నవీన్, సలహాదారులుగా మెట్లి క్రిష్ణ, కార్యవర్గ సభ్యులుగా నర్సింహులు, రాంచందర్, క్రిష్ణ, యాదయ్య, నరేష్ తదితరులు ఉన్నారు

నేడు అయ్యప్పస్వామి పడి పూజ

బంట్వారం: అయ్యప్పస్వామి మహాపడి పూజ బంట్వారం మండల కేంద్రంలో సోమవారం నిర్వహిస్తున్నట్లు మర్పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దుర్గం చెరువు మల్లేశం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గురుస్వామి నాగభూషణం ఇంటి వద్ద మహాపడి పూజ ఉంటుందన్నారు. అయ్యప్ప స్వాములు, భక్తులు హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించాల్సిందిగా ఆయన కోరారు.

పకడ్బందీగా సర్వే నిర్వహిస్తాం

ఎంపీడీఓ విశ్వప్రసాద్



తాండూరు రూరల్: ఇందిరమ్మ ఇళ్ల పథకం కోసం తీసుకొచ్చిన మొబైల్ యాప్ సర్వేను పకడ్బందీగా నిర్వహిస్తామని ఎంపీడీఓ విశ్వప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. తాండూరు మండలంలో 33 గ్రామాల్లో సోమవారం నుంచి ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రారంభమవుతుందన్నారు. ఈ సర్వేను క్షేత్రస్థాయిలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ప్రజాపాలనలో నమోదు చేసుకున్న విధంగా దరఖాస్తుదారుడి ఇంటికి వెళ్లి పరిశీలిస్తామన్నారు. సర్వేకు ముందురోజు ఆయా గ్రామాల్లో డప్పుతో చాటింపు నిర్వహిస్తామని పేర్కొన్నారు. గ్రామస్తులు అవసరమైన పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

హస్నాబాద్‌లో..

దుద్యాల్: మండలంలోని హస్నాబాద్ గ్రామంలో సోమవారం నుంచి ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజాపాలన దరఖాస్తును పరిశీలించి సంబంధిత వ్యక్తుల ఇళ్లను పరిశీలించనున్నట్లు చెప్పారు.

దశాబ్దంగా 'రియల్' కుదేలు

సమావేశంలో రియల్టర్ల ఆవేదన

తాండూరు: దశాబ్ద కాలంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం జరగక అప్పుల్లో కూరుకుపోయామని.. ప్రభుత్వం ప్లాట్‌లకు రిజిస్ట్రేషన్‌లు జరిగేలా చూడాలని తాండూరు రియల్ వ్యాపారులు ప్రభుత్వానికి మొరపెట్టుకున్నారు. ఆదివారం తాండూరు పట్టణంలోని కింగ్స్ ప్యాలెస్‌లో నియోజకవర్గంలోని 200 మంది రియల్ వ్యాపారులు హాజరై సమావేశం నిర్వహించారు. కొన్నేళ్లుగా రియల్ వ్యాపారం పడిపోయిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వచ్చాక రియల్ రంగం తిరిగి జీవం పోసుకొంటుందని అందరు భావించామని అయితే ఏడాది కాలంగా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకొలేదన్నారు. దశాబ్దాల క్రితం చేసిన ప్లాట్‌లను సైతం లేఅవుట్ లేదనే నెపంతో రిజిస్ట్రేషన్ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రియల్ వ్యాపారులు శ్రీనివాసచారి, అబ్దుల్లా ముజహిద్, గౌరిరాములు, తాహెర్‌ఖురేషి, మల్లారెడ్డి, షల్లో, వీరేందర్‌పటేల్, బషరత్, శ్రీశైలం, నయిమ్‌ఖాన్, అబ్దుల్ రజాక్, అమ్జద్‌అలీ, అస్లాం, సలీమ్ తదితరులున్నారు.

రోడ్డు నిర్మాణం చేపట్టాలంటూ నిరసన



ప్రొద్దటూర్‌లో నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

శంకర్‌పల్లి: మండలంలోని ప్రొద్దటూర్ నుంచి టంగటూర్ మీదుగా రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ప్రొద్దటూర్ గ్రామంలో గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ.. ప్రొద్దటూర్-టంగటూర్ మీదుగా చేవెళ్ల మండలం ఈర్లపల్లి వరకు, ప్రొద్దటూర్-మేడిపల్లి వరకు రోడ్డు నిర్మాణ పనులను చేపట్టాలని కోరుతూ ఇప్పటికే పలుమార్లు స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్యకు వినతిపత్రాలు సమర్పించినా స్పందించడం లేదన్నారు. రోడ్లు సరిగా లేకపోవడంతో నిత్యం ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నట్లు స్పష్టం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి 15రోజుల్లో పనులు ప్రారంభించాలని, లేకపోతే పెద్దఎత్తున ధర్నాలు చేపడుతామని హెచ్చరించారు. నిరసనలో గ్రామస్తులు గోవర్ధన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, అబ్బాస్ స్వామి, కాటికే శ్రీనివాస్, మల్లారెడ్డి, వెంకటేశ్, బండ నర్సింలు, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు సీసీకెమెరాలు దోహదం

ఎస్ఐ సుశీల



సీసీ కెమెరాల ఆవశ్యకతను వివరిస్తున్న ఎస్ఐ సుశీల

షాద్‌నగర్‌రూరల్: నేరాలను నియంత్రించడంలో సీసీకెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని ఎస్ఐ సుశీల అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని దూసకల్, కమ్మదనం గ్రామాల్లో ఆంజనేయస్వామి దేవాలయాల వద్ద దాతల సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాలలో సీసీ కెమెరాలను ఆదివారం ఎస్ఐ సుశీల పరిశీలించారు. సీసీ కెమెరాల ఆవశ్యకతను గ్రామస్తులకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతో నేరాలను నియంత్రించవచ్చన్నారు. గ్రామంలోని ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఒక్క సీసీకెమెరా వంద మంది పోలీసులతో సమానమన్నారు. నేరాలు, దొంగతనాలు జరిగినప్పుడు నిందితులను గుర్తించేందుకు అవకాశం ఉంటుందన్నారు. గ్రామంలోని ముఖ్య కూడళ్లు, బస్టాండ్, చౌరస్తా వంటి ప్రదేశాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. నేరాల నియంత్రణలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన మురళీధర్‌రెడ్డి, నర్సింలు, అమరేందర్‌రెడ్డి, నర్సింహారెడ్డిని ఆమె అభినందించారు.

హామీలన్నీ అమలు

మంత్రులు తుమ్మల, సీతక్క



ఆలయ చైర్మన్‌గా మైపాల్‌రెడ్డి ప్రమాణస్వీకారం



చైర్మన్ కుర్చీలో ఆంజనేయులును కూర్చొబెట్టిన మంత్రులు తుమ్మల, సీతక్క, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

కుల్కచర్ల: ప్రజాసంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క అన్నారు. ఆదివారం మండలం బండవెల్కిచర్ల గ్రామంలో పాంబండ రామలింగేశ్వర దేవస్థానంలో ఆలయ నూతన పాలకవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కుల్కచర్లలో మార్కెట్ కమిటీ చైర్మన్, పాలకవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని అట్టహాసంగా ఏర్పాటు చేశారు. ఆలయ ప్రమాణస్వీకారోత్సవంలో మంత్రులు తుమ్మల, సీతక్క మాట్లాడుతూ.. అనివార్యకారణాల వల్ల దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హాజరవ్వలేదని ఆలయాభివృద్ధి పనులను వారికి వివరిస్తామన్నారు.

కలెక్టర్ ప్రతీక్‌జైన్‌పై ప్రశంసల జల్లు

గతంలో ఐటీడీఏ భద్రాచలంలో పనిచేసిన కలెక్టర్ ప్రతీక్‌జైన్‌పై మంత్రులు ప్రశంసల జల్లు కురిపించారు. వెనుకబడిన వర్గాలు, చెంచుల అభ్యున్నతికి ప్రతీక్‌జైన్‌చేసిన కృషి గొప్పదన్నారు. వికారాబాద్‌కు ఆయన సేవలు లభించడం అదృష్టమన్నారు. అనంతరం ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. కలెక్టర్ ప్రతీక్‌జైన్ ప్రత్యేక చొరవతో అల్మాస్‌ఖాన్‌పేట్ భూ సమస్యలు, చౌడాపూర్ మండలం ముక్తవెంకటాపూర్ భూ సమస్యలు పరిష్కారానికి అవకాశం ఏర్పడిందన్నారు. ఈ సమస్య పరిష్కారానికి 80 ఏళ్లుగా బాధితులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు.

తుమ్మల నోట లగచర్ల ముచ్చట

కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ గూరించి మాట్లాడుతున్న సందర్భంలో అవకాశవాద రాజకీయాలకై ప్రతిపక్ష పార్టీలు ప్రజల కోసం పనిచేసే కలెక్టర్ ప్రతీక్ జైన్‌పై దాడికి పాల్పడటం అవివేకమన్నారు. ప్రజలు అన్ని విషయాలను గమనిస్తున్నారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో మాత్రమే పల్లెల్లో అభివృద్ధి సాధ్యమన్నారు.

లక్షలు వెచ్చించి.. లక్షణంగా వదిలేసి

- నిరుపయోగంగా ప్రభుత్వ భవనాలు
- విషపూరిత కీటకాలకు స్థావరంగా మారుతున్న వైనం
- వినియోగంలోకి తీసుకురావాలని వేడుకోలు
- పట్టించుకోని అధికారులు



వృథాగా మండల పరిషత్ పూర్వ కార్యాలయ భవనం



వృథాగా వ్యవసాయ కార్యాలయ భవనం

కొందుర్గు: మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రభుత్వ భవనాలను నిరుపయోగంగా వదిలేశారు. ప్రజాసొమ్ము లక్షల రూపాయలు ఖర్చుచేసి ఇలా భవనాలు వదిలేయడం ఏమిటని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నూతనంగా మండల పరిషత్ కార్యాలయానికి భవనం నిర్మించడంతో ఇదివరకు మండల పరిషత్ కార్యాలయంగా కొనసాగిన రెండు భవనాలు వృథాగానే ఉన్నాయి. ఓ భవనంలో ఇటీవల లక్షల రూపాయలు ఖర్చుచేసి మరమ్మతులు చేయించారు. ఆర్‌సీసీ పైకప్పు గల చక్కని భవనాన్ని ఇలా వదిలేయడమేమిటనీ అంటున్నారు. అదేవిధంగా వ్యవసాయ కార్యాలయంగా కొనసాగిన ఓ భవనం, మోడల్ ఇందిరమ్మ ఇళ్ల కోసం నిర్మించిన మరో భవనం వృథాగానే పడిఉన్నాయి. ఇక గతంలో పీహెచ్‌సీ సిబ్బందికి కేటాయించిన ఓ భవనం కూడా వృథాగానే ఉంది. దీంతో మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎనిమిది వరకు భవనాలు వృథాగానే ఉన్నాయి. వీటిని వినియోగించకపోవడంతో విషపూరిత కీటకాలకు స్థావరంగా మారాయని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భవనాలను వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.